# టైగర్ వాత్సవ



## మధుబాబు

# టైగర్ వాత్సవ

మధుబాబు

Kinige

TIGER VATSAVA

(Direct Novel)

By :

Madhu Baabu

Edition:

April 2011

Publishers :

SRI SRINIVASA PUBLICATIONS

4/4, A.T.Agraharam,

Guntur - 522 004.

Ph : 0863 - 2357945

This book is digitized and brought to you by KINIGE

© Author

© Madhu Baabu

This digital book is published by -

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# టైగర్ వాత్సవ

ఉదయం పది గంటల సమయంలో సిటీ సెక్యూరిటీ సర్వీసెస్ ముందు టాక్సీ దిగింది వాసంతి. ఒక కరెన్సీ నోటును డ్రయివర్‌కి అందించి, మెయిన్ గేటును క్రాస్ చేయబోతుండగా, పరుగు పరుగున వచ్చి, ఆమెను పలుకరించాడు కాలేషావలీ.

సిటీ సెక్యూరిటీ సర్వీసెస్ పనిచేసే బిల్డింగ్‌కి ఎదురుగా, రోడ్డుకు ఆవలివైపున ఒక కిళ్ళీ బడ్డీని నడుపుకుంటూ వుంటాడతను.

“వాళ్ళు ఎవరోగాని చాలా రఫ్‌గా కనిపిస్తున్నారమ్మా..... ఎందుకయినా మంచిది మీరు కాస్తంత ఎలర్ట్‌గా వుండాలి.... నన్నీ బడ్డీ మూసి ఆఫీసులోకి రమ్మంటే వస్తాను” అని అన్నాడు.

ఆ మాటలకు మరింత అందంగా నవ్వి తల అడ్డంగా తిప్పింది వాసంతి. “ఇట్సాల్ రైట్ కాలేషావలీ.... అవసరం అయితే కిటికీలోనుంచి నీకు వినిపించేలా కేక వేస్తాను. అప్పుడు వద్దువుగాని” అంటూ బిల్డింగ్ లోకి ఎంటర్ అయింది.

పై అంతస్థుకు దారితీసే లిఫ్ట్ దగ్గర ఎప్పటి మాదిరిగానే యధాస్థానంలో కూర్చుని వున్నాడు వాచ్‌మన్. ఆమెను చూడగానే లేచి నిలుచుని, స్టిఫ్‌గా శాల్యూట్ చేశాడు.

తమ ఆఫీసు దగ్గరికి వచ్చిన వ్యక్తులను గురించి అతను చెప్పకపోవటం కాస్తంత విచిత్రంగానే కనిపించింది వాసంతికి.

“ఈరోజు మాకోసం ఎవరైనా లోపలికి వచ్చారా?” లిఫ్ట్ లోకి ఎంటర్ అవుతూ అతన్ని ప్రశ్నించింది.

“పొద్దుటి నుంచీ యిక్కడే వున్నాను. ఎవరూ రాలేదమ్మా....” అన్నాడు వాచ్ మన్.

అందమైన బిల్డింగ్‌లో ఆపరేట్ చేయబడుతోంది సిటీ సెక్యూరిటీ సర్వీసెస్.... ఆ బిల్డింగ్ అందచందాల్ని పరిశీలనగా చూసేందుకు వచ్చిన వారిని గమనించి వుంటాడు కాలేషావలీ.. వారెవరో శత్రువులని భ్రమపడి ఆందోళన చెంది వుంటాడు. అతని మాటల్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

లిఫ్టు రెండో అంతస్థులో వున్న తమ ఆఫీసు ముందు ఆగటంతో పూర్తి అయిపోయాయి వాసంతి ఆలోచనలు.

ఆఫీసును తెరిచి, తన టేబిల్ మీద వున్న ఫోన్ వంక చూసిందామె . ఆ ఫోన్‌కు ఎటాచ్ చేయబడి వున్నది ఒక విచిత్రమైన ఎలక్ట్రానిక్ పరికరం. ఆమె అక్కడ లేనప్పుడు ఎవరయినా ఫోన్ చేస్తే ఆటమేటిక్‌గా సమాధానం యిస్తుంది అది. అవతలివారు ఏదయినా మెస్సేజి యిస్తే రికార్డు చేసి వుంచుతుంది.

అంతకు ముందురోజు సాయంత్రం తను ఆఫీసును క్లోజ్ చేసినప్పటి నుంచీ, ఆ క్షణంవరకూ ఎవరూ ఫోన్లు చేయలేదని ఆ మెషీన్ పైభాగంలో వున్న డయల్ ద్వారా అర్థం చేసుకుని, తన రొటీన్ పనుల్లో బిజీ అయిపోయిందామె.

పోస్ట్‌మన్ తీసుకు వచ్చిన పోస్ట్‌లో అప్పటికప్పుడు సమాధానం ఇవ్వాల్సిన లెటర్స్ ఏవీలేవని అర్ధమై, అవతల పడేసింది వాటన్నిటినీ. క్రింది అంతస్థులో వున్న స్వీపర్‌ని పిలిచి ఆఫీసును క్లీన్ చేయించింది.

పది గంటలు దాటిన ఇరవై నిముషాలకు డోర్ బెల్ మ్రోగటంతో తల ఎత్తి గుమ్మంవైపు చూసింది.

కాలేషావలీ చెప్పినట్లు కాస్తంత రఫ్‌గా కనిపిస్తున్న వ్యక్తులు ఇద్దరు హుందాగా అడుగులు వేస్తూ లోపలికి వచ్చారు.

"వాత్సవగారిని మేము వెంటనే కలుసుకోవాలి…." లోపలికి వచ్చీ రావటంతోనే అనవసరమైన మాటలతో టైమ్‌ని వేస్ట్ చేయకుండా అసలు విషయాన్ని ఆమెకు వివరించాడు ఒక వ్యక్తి.

"వాత్సవగారు విదేశాలకు వెళ్ళారు…. అమెరికాలో వున్నారు ప్రస్థుతం ఇంకో నాలుగైదురోజుల వరకూ రారు" వారి వాలకాన్ని పరిశీలనగా చూస్తూ చెప్పింది వాసంతి.

"అయితే ఆయన అసిస్టెంట్ శ్యామ్‌సుందర్‌ని పిలవండి…" తడుముకోకుండా అన్నాడు ఆ వ్యక్తి.

"శ్యామ్‌సుందర్ వాత్సవ అసిస్టెంట్ కారు. పార్టనర్….." కూల్‌గా ఒక ముఖ్యమైన విషయాన్ని వారికి గుర్తు చేసిందామె.

"అదే…. ఆ పార్టనర్ శ్యామ్‌సుందర్‌ని మేము కలుసుకోవాలి…."

"శ్యామ్‌సుందర్ ఇంకా ఆఫీసుకు రాలేదు.... అసలు ఈ రోజు వస్తారో రారో నాకు తెలియదు. ఆయన వచ్చిన తర్వాత మీ గురించి చెపుతాను. మీ ఫోన్ నెంబర్ యివ్వండి .... ఇన్‌ఫామ్ చేస్తాను."

ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ అలాగే నిలబడిపోయారా వ్యక్తులు.

రెండు క్షణాలు గడిచిన తర్వాత కూడా వారి నోటివెంట మాటలు వెలువడకపోవటంతో అసహనంగా అటూ ఇటూ కదిలింది వాసంతి.

"మీ రెవరో, ఎందుకు వచ్చారో చెప్పండి..." అంటూ పెన్‌ని, ఒక తెల్ల కాగితాన్ని వారి ముందుకు నెట్టింది.

ఆమె వంకా, ఆ కాగితం వంకా మార్చి మార్చి చూసి, వున్నట్లుండి వెనుదిరిగారు ఆ వ్యక్తులు. "ఆగండి.... మీరు ఎవరో చెప్పి వెళ్ళండి" అని వాసంతి గట్టిగా అడుగుతున్నా వినిపించుకోకుండా బయటికి వెళ్ళిపోయారు.

పది నిముషాలు ఆగి ఇన్స్‌పెక్టర్ రమేష్ పనిచేస్తూ వుండే స్టేషన్‌కి రింగ్ చేసింది వాసంతి.

వాత్సవ, శ్యామ్‌సుందర్‌లకు బాగా కావాల్సిన మనిషి ఆ ఇన్స్‌పెక్టర్ రమేష్. ఒకరికోసం ఒకరు ఏమైనా చేయగల అనుబంధం వారి మధ్యన వున్నది.

"హల్లో.... రమేష్‌ని మాట్లాడుతున్నాను....." అంటూ అతని కంఠం వినిపించగానే "నాకు శ్యామ్‌సుందర్ కావాలి.... అతను గనుక మీ దగ్గరికి రావటం అంటూ జరిగితే వెంటనే నన్ను కంటాక్టు చేయమని చెప్పగలరా?" రిక్వెస్ట్ చేసింది వాసంతి.

"శ్యామ్‌సుందర్ నా దగ్గరికి ఎందుకు వస్తాడు?" తన పోలీస్ బుద్ధిని పోనిచ్చుకోలేదు ఇన్‌స్పెక్టర్ రమేష్.

అతని ప్రశ్నకు సమాధానం యివ్వటం తనకు చేతకాదని వాసంతికి తెలుసు.

"ఎందుకు వస్తాడో నాకు తెలియదు. వస్తే వెంటనే నాకు ఫోన్ చేయమని చెప్పండి" అంటూ లైన్‌ని డిస్కనెక్ట్ చేసి, శ్యామ్‌సుందర్ నివశించే ఒక ఎపార్ట్‌మెంట్‌కి రింగ్ చేసింది.

వాత్సవకు, అతని పార్టనర్ శ్యామ్‌సుందర్‌కి వేరు వేరు అపార్ట్‌మెంట్స్ వున్నాయి నగరంలో. ఇద్దరికీ కలిపి సిటీ వెలుపల ఒక పెద్ద ఫారమ్ హౌస్ వున్నది. వాటన్నిటి దగ్గిరా శ్యామ్‌సుందర్ లేడనే విన వచ్చింది వాసంతికి.

ఆ రోజు ఉదయం ఆరు గంటలకు ఫారమ్ హౌస్ దగ్గిర్నించి సిటీలోకి వచ్చేశాడట అతను. ఎక్కడికి పోతున్నాడో ఎవరికీ చెప్పలేదుట.

ఎన్నడూ లేనిది ఎందుకనో కాస్తంత విసుగ్గా అనిపించి, చేతిలోని రిసీవర్‌ని విసురుగా ఫోన్ మీద పడవేసింది వాసంతి. ఎడమ చేతివైపున వున్న విండో దగ్గరికి పోయి రోడ్డు మీదికి తొంగి చూసింది.

అర్థం పర్థంలేని మాటలు మాట్లాడి వేగంగా వెళ్ళిపోయిన రఫ్ పర్సనాలిటీలు రెండూ ఆ చుట్టుపట్ల ఎక్కడా అగుపించలేదామెకు.... నిముషానికి రెండుసార్లు తల ఎత్తి పైకి చూస్తున్న బడ్డీకొట్టు కాలేషావలీ కనిపించాడు.

అతని సైగచేసి, శ్యామ్‌సుందర్ కోసం పంపించాలనే కోరికను అతి బలవంతంగా అదుముకుంటూ వెనక్కి వచ్చేసిందామె.

సిటీ సెక్యూరిటీ కన్సల్టెంట్స్‌కి వస్తే తమ బాధలు బరువులు అన్నీ తీరతాయనే నమ్మకంతో ప్రతిరోజు అనేక మంది వచ్చి వాత్సవను కలుసుకుంటూ వుంటారు. తమ ఇబ్బందుల గురించి చెప్పకుని తగిన సలహాలు, సూచనల్ని పొందుతూ వుంటారు.

వచ్చిన ప్రతి మనిషి ఆఫీసర్స్ దగ్గర్నించి అతి సామాన్యుల వరకూ ఎంతో మర్యాదగా బిహేవ్ చేస్తూ వుంటారు.... ఇప్పుడు వచ్చి వెళ్ళిన వారి పద్ధతి అందుకు విరుద్ధంగా వున్నది.

వాత్సవ, శ్యామ్‌సుందర్‌ల దగ్గిర పనిచేయటం మొదలు పెట్టిన క్షణం నుంచీ ఎంతో రఫ్ కారెక్టర్స్‌ని కూడా చూసి వున్నది వాసంతి. వారెవరూ ఇప్పుడు వచ్చిన వ్యక్తుల మాదిరి తనను కలవరానికి గురి చేయలేదని అనుకుంటూ, తన పని తను చేసుకోవటంలో నిమగ్నురాలై పోయిందామె.

ఆమె మనసులో ఒక భాగం మాత్రం శ్యామ్‌సుందర్‌ని గురించే ఆలోచిస్తోంది. తను ఆఫీసుకు రాకముందే వచ్చి, తన గదిలో కూర్చుని వెయిట్ చేస్తుండేవాడు ప్రతిరోజు. ఏదయినా పని వుంటే ముందుగానే తనకు చెప్పి ఆ వర్క్‌కి అటెండ్ అవుతాడు. ఆరోజు ఇంకా రాలేదు. కనీసం ఫోన్ కూడా చేయలేదు. ఏమైపోయాడు?

ఆ ప్రశ్నకు సమాధానం లభించకముందే ఆమెకు ఎదురుగా గోడకు బిగించి వున్న ఎలక్ట్రానిక్ వాల్ క్లాక్ ఒంటి గంటను సూచించింది.

గాఢంగా నిట్టూరుస్తూ తన కుర్చీలో నుంచి లేచింది వాసవి. హేండ్ బేగ్‌లో వున్న లంచ్ బాక్స్ ని తీసుకుని, డైనింగ్ రూమ్ వైపు అడుగులు వేసింది.

* * *

తన ఎడమచేతిని వున్న రిస్ట్ వాచ్ ఒంటిగంట అయినట్లు సూచించటంతో అసహనంగా కుర్చీలో కదిలాడు శ్యామ్‌సుందర్.

అది చూసి పరుగులాంటి నడకతో అతని ఎదుటికి వచ్చేశాడు వెయిటర్.

“ఏం తీసుకు రమ్మంటారు సార్? రెండు సమోసాలు, ఇంకో చాయ్‌ని తెమ్మంటారా?” అని వినయంగా అడిగాడు.

ఓల్డ్ టౌన్ చివరిభాగంలో వున్న ఆ ఇరానీ హోటల్లోకి ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో వచ్చి కూర్చున్నాడు శ్యామ్‌సుందర్. హోటల్‌కి ఎదురుగా రోడ్డుకు ఆవలివైపున వున్న ఒక పురాతన కాలపు భవనం వైపే చూస్తూ, ఒక కుర్చీలో సెటిల్ అయ్యాడు.

అప్పటికి పన్నెండు టీలు త్రాగి వున్నాడతను. ఎనిమిది సమోసాలను ఆరగించాడు. ఏదో ఒకటి చెప్పకపోతే ఆ వెయిటర్ తనను వదిలిపెట్టడని గ్రహించి, అతని మాటలకు తల వూపేశాడు.

పరుగులాంటి నడకతో పోయి, రెండు క్షణాల్లో సమోసాలను తెచ్చి ఇచ్చాడు వెయిటర్. చాయ్ కప్పును ఎదుటపెట్టాడు

ఒక సమోసాను విరిచి నోటిలో పెట్టుకోబోతుండగా, రోడ్డు ఆవలి పక్కన వున్న భవనంలోనుంచి సఫర్‌జంగ్ ఇవతలికి రావడం అగుపించింది శ్యామ్‌సుందర్ కి.

ఎదుటవున్న చాయ్ వంక చూడనుకూడా చూడకుండా కుర్చీలో నుంచి లేచాడతను. ఆశ్చర్యంగా చూస్తున్న వెయిటర్ మీదికి ఒక కరెన్సీ నోటును విసిరి, వేగంగా రోడ్డుమీదికి వచ్చాడు.

పాంటు జేబుల్లో చేతులు పెట్టుకుని కులాసాగా విజిల్ వేస్తూ రోడ్డు ఎక్కి , దగ్గిర్లో వున్న ఒక ఆటోస్టాండ్ వైపు అడుగులు వేస్తున్నాడు భవనంలో నుంచి బయటికి వచ్చిన సఫర్‌జంగ్.

“ఒక్కసారి ఆగు మై ఫ్రండ్.... నాతో ఒక్కమాట మాట్లాడి అవతలికిపో.....” అంటూ అతన్ని సమీపించి భుజం మీద చేయివేశాడు శ్యామ్‌సుందర్.

ముఖం మీద ఎవరో లాగిపెట్టి కొట్టినట్లు ఉలిక్కిపడ్డాడు సఫర్‌జంగ్ అతన్ని చూడగానే. తనకు తెలియకుండానే తన భుజం మీద పడిన అతని చేతిని విదిలించి కొడుతూ, వెనక్కి జరిగాడు.

“పాత స్నేహితులం మనం. కనిపించగానే నవ్వుతూ పలుకరించుకోవాలి. శత్రువును చూసినట్లు కంగారు పడకూడదు” అంటూ చటుక్కున చేతిని జాచి, షర్టును ఒడిసిపట్టుకున్నాడు శ్యామ్‌సుందర్.

"వదిలిపెట్టండి సార్.... నన్ను వదిలిపెట్టండి..." హీన స్వరంతో అంటూ అతని చేతిలో బిగుసుకుపోయిన షర్టును వదిలించుకోవటానికి చూశాడు సఫర్‌జంగ్.

మరింత గట్టిగా పట్టుకున్నాడు శ్యామ్‌సుందర్ . ఎడమ చేతిని జాచి ఫట్ మని అతని నోటిమీద కొట్టాడు.

బలమైన ఇనుపబద్దీ పెట్టి కొట్టినట్లు వెంటనే గాయపడింది. సఫర్‌జంగ్ నోరు. ఎర్రటి రక్తం వెల్లువలా పెదవుల్ని దాటి అతని షర్ట్ మీదికి జారటం మొదలు పెట్టింది.

ఆ రక్తాన్ని చూసుకునేసరికి కళ్ళు పచ్చబడిపోయాయి అతనికీ.

"రక్షించండి.... నన్ను ఎవరైనా రక్షించండి.... కాపాడండి" అని కీచుగా అరుస్తూ నిలుచున్న చోటునే చతికిలపడిపోయాడు.

తగాదాలకు తన్నులాటలకు పెట్టింది పేరైన ఆ ఓల్డ్ టౌన్‌లో, గుండెల్ని కదిలించే సఫర్‌జంగ్ అరుపులు ఎవరినీ ఆకర్షించలేకపోయాయి.

అప్పటికే అటుగా పోతున్న నలుగురు వ్యక్తులు ఒక్కక్షణం పాటు ఆగి ప్రశ్నార్థకంగా చూశారు శ్యామ్‌సుందర్ వంక.

అసలు విషయాన్ని వారికి చెప్పదలుచుకోలేదు శ్యామ్‌సుందర్.

"వీడు నాకు వెయ్యి రూపాయలు బాకీపడి, నాలుగు నెలల నుంచీ తప్పించుకు తిరుగుతున్నాడు..." అన్నాడు వారితో.

“మరో సారి ఇటువంటి పని చేయకుండా ఇంకో రెండు పోట్లు పోడవాలి దోస్త్.... వదిలిపెట్టకూడదు” అంటూ తమ దారిన తాము వెళ్ళిపోయారు వాళ్ళు.

“అబద్ధం.... అంతా అబద్ధం... ఇతనికి నేను బాకీలేను..... అబద్ధం” అని కీచుగా అరిచి వారిని వెనక్కు రప్పించాలని చూశాడు సఫర్‌జంగ్.

అరుపులు అతని పెదవుల్ని దాటకముందే బూటుకాలితో అతని గుండెలమీద తన్నాడు శ్యామ్‌సుందర్.

“నీ వంటి పిచ్చికుక్కలకు ఎటువంటి మందువేస్తే బాగుంటుందో నాకు బాగా తెలుసు..... లేచి నిలబడు....” అంటూ బలంగా పైకి లేపాడు.

అరిచి కేకలు పెట్టినందువల్ల ఉపయోగం ఏదీ వుడదని అర్ధం అయింది సఫర్‌జంగ్‌కి. నోరు తెరిచిన మరుక్షణం మరో రెండు దెబ్బలు నోటిమీద పడతాయని కూడా తెలిసిపోయింది.

ఎదురు చెప్పకుండా, ఎదిరించటానికి ప్రయత్నించకుండా పైకి లేచాడతను. శ్యామ్‌సుందర్ వెంట ముందుకు నడిచాడు.

“మేము టూ టవున్ స్టేషన్‌కి పోవాలి....పోలీసుల్ని చూసి భయంతో వణికిపోని వాళ్ళు మీలో ఎవరున్నారు?” ఆటోస్టాండ్ దగ్గిర ఆగి, అక్కడి ఆటోడ్రయివర్స్ అందరినీ అడిగాడు శ్యామ్‌సుందర్.

అరక్షణం తరువాత అతని ఎదుటికి వచ్చాడు ఒక వ్యక్తి.

“నేను వస్తాను సార్... పోలీసుల్ని చూసి భయపడాల్సిన పాడు పనులు ఏవీ నేను చేయలేదు....” అంటూ ఆటోని స్టార్టు చేశాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/kbook.php?id=2054

* * *

**Read other books of Madhu Baabu @**

http://kinige.com/kbrowse.php?via=author&name=Madhu+babu&id=20